# మనసులో సొగసు

ప్రియమయిన రాధా, నీ ఉత్తరం అందింది. నేను చాలా మారిపోయాననీ ఇన్నాళ్ళకి నా కాపురం పచ్చగా ఉండడం చూసి ముచ్చటపడ్డాననీ రాశావు. చాలాసంతోషం. ఇన్నేళ్ళకొద్దీ ఒకేవిధంగా పెరగడానికి అలవాటయిన శరీరమూ, ఒకేవిధంగా ఆలోచించడానికి అలవాటయిన మనస్సూ మారడం చాలా...చాలా కష్టం. కాని మారిన నా మనశ్శక్తి వెనుక ఒక మహత్తర వ్యక్తి కథ ఉంది. ఆ కథ నా మనసులో పటం కట్టి దాచుకున్న గాథ. వింటావా?

నేను చాలా బద్ధకస్తురాలిననీ, అటు వస్తువు ఇటు పెట్టలేనంత సుకుమారిననీ చదువుకున్న రోజుల్లో తెగతిట్టిపోశేదానివి. నిజమే. ఇచ్చ రూపాయలతో గచ్చకాయలాడుకునే అమ్మకి నేనొక్కర్తినే సర్వస్వం. నోటు అంటించి సిగరెట్టు కాల్చుకొనే భర్తకి నేనొక్కర్తినే ప్రపంచం. సహజమైన నా బద్ధకం స్వైర విహారం చెయ్యడంలో అభ్యంతరం ఏముంది? వంటకీ పై పనికీ, నీళ్ళు కాచడానికీ, పిల్లల్ని ఆడించడానికీ, అన్నిటికీ పనిమనుషులున్నారు. పుస్తకంతో పొద్దుపుచ్చే మస్తకం నాదికాదని నీకు తెలుసు. నాకింకేం తోస్తుంది? నా మనసులోని శూన్యం వేసే గంతులికి అంతం లేకపోయింది. విపరీతమైన విసుగు, చెప్పలేని చిరాకు, అతినీరసంగా ఉన్నాననే భావం, ఏ గడియకు ప్రాణం పోతుందో అనే భయం ఈ చిత్రమైన మనస్తత్వంతో ఇది అని చెప్పలేని మనోవ్యాధితో బాధపడిపోయాను. ఆయన పడ్డ ఆదుర్దా నా రోగాన్ని పెంచింది. ఆఫీసు వదిలి ఆయనా, నోరెరగని నా పిల్లలూ నా మంచం వదిలేవారు కారు. ఊళ్ళోఉన్న డాక్టర్లందరూ మా యింట్లోనే ఉండేవారు. కాని థర్మామీటరుకీ, స్టెతస్కోపుకీ, ఎక్సురేకీ అతీతమయిన నా జబ్బుని ఎవరు పోల్చగలరు? ఎలా కుదర్చగలరు? ఆయన ఎన్ని చోట్లనో చూపించి ఎన్ని వేలో ఖర్చు పెట్టారు. ఎవరూ ఏం లేదు పొమ్మన్నారు. ఆఖరికి బెజవాడలో వీర్రాజుగారని, గొప్ప వైద్యుడని పేరులే—వీరే ప్రైవేటు హాస్పటలు నడుపుతున్నాడు—అక్కడికి తీసుకెళ్ళారు. ఒక రూంలో నన్ను ఉంచారు.

మా పక్క రూంలో గుండె జబ్బు పేషెంటు ఒకామె ఉండేది. మా రెండు గదులకీ పెద్ద కిటికీ అడ్డం. ఆ కిటికీకి సరిపోయే ఎత్తులో నా మంచం ఉండే. ఒక రోజు ఆవిడ దగ్గిరికి ఒకపాతికేళ్ళ అబ్బాయి వచ్చాడు. అంత పెద్దవాడు ఏడుస్తూంటే నా మనస్సు సహజంగా అటు ఆకర్షింపబడింది.

'ఛా, ఊరుకో...ఏమిటదీ? ఇప్పుడు నాకేమొచ్చింది తమ్ముడూ...ఊరుకోమంటే...నాకోసం బెంగెట్టుకున్నావా బాబూ...ఇలారా...దగ్గిరగా కూచో...అయ్యో.. ఇలా చిక్కిపోయావేంరా?'

'నువ్వు మనిషివా దేవతవా? నువ్వు మాకెలా దక్కుతావు అ-క్క-య్యా!'

'ఊరుకోమంటే, నీకేం మతుందా లేదా? ఇప్పుడు నాకేమొచ్చింది?'

'అవును, నీకేమొచ్చింది? నువ్వు కులాసాగానే ఉన్నావు మహా అంటే మూడొందల

అవసరాల రామకృష్ణారావు

వరకు బ్లడ్ ప్రెషరు ఉంటుంది. వారానికి ఒక హార్ట్ ఎటాక్ వస్తూ ఉంటుంది. నిద్ర పట్టదు. సరిగ్గా నల్లకిలా పడుకోలేవు నీకేమొచ్చింది? ఏమీ రాలేదు?...నీ కంటికి నేనే చిక్కిపోయినట్టు కనిపిస్తున్నాను. ఇంత బాధలో ఎదుటివారిగురించి ఆలోచిస్తావ్! ఇలాంటిదానివి ఇలాంటిదానివి మా కెందుకు దక్కుతావు అక్కయ్యా!'

'ఏంరా తమ్ముడూ ఇందుకేనా నువ్వొచ్చింది? ఇదేనా ఈ స్థితిలో నువ్వు నాకు చెప్పే ధైర్యం?'

'లేదక్కయ్యా లేదు...ఒక సంతోషమొచ్చినా ఒక దుఃఖమొచ్చినా భరించలేని సామాన్య మానవుణ్ణి. ఏదో అనేశాను...అది సరే...వీర్రాజుగారు మళ్ళీ చూశారా? ఏమన్నారక్కయ్యా?'

'తగ్గిపోతుందన్నారు బాబూ...దానికేం గాని నాన్న దగ్గు ఎలా ఉంది? కాస్త తగ్గిందా?'

'మాకేం? మేం అందరం హాయిగా ఉన్నాం. ముందు నీ మాట చెప్పు. ఈమధ్య మళ్ళీ 'బ్లడ్ ప్రెషరు' నోట్ చేశారా?'

'నేట్రగా కొంచెం తగ్గిందట. ఎందుకింత వెర్రెత్తిపోతావు బాబూ ఇంతింత పెదజబ్బులు వచ్చింతర్వాత ఒక్కమారుగా తగ్గిపోతాయా? నెమ్మది నెమ్మదిగా తగ్గుతోంది. ఇదివరకువచ్చిన ఎటాక్ కంటె కాస్త తక్కువగానే వచ్చిందని మనవాళ్ళతో చెప్పు. సరేగాని చూడూ.. ఈ పక్కనే నీళ్ళుపోసేమనిషి ఉంటాడు. నీళ్ళు పెట్టించుకుని పోసుకో...వెళ్ళు...హోటల్లో భోంచేసిరా...యీ ఎదురుగుండాఉన్న హోటలు కాదు. బస్సుస్టాండు దగ్గిర హోటలుకి వెళ్ళు అక్కడ బాగుంటుందిట. మీ బావ చెప్పేరు.'

'అన్నట్టు ఆ మాటే మరచిపోయాను, బావేడి అక్కయ్యా.'

'ఆయనా వచ్చేవేళయింది......చూడూ తమ్ముడూ ఒక్కమాట...ఆయనతో మందుల ఊసేం ఎత్తకు...రాత్రీ పగలూ ఒక్కలా చాకిరీ చేస్తున్నారు. అసలే అర్భకంమనిషి. పూచికపుల్లలా అయిపోయారు. ఒకటే బెంగ.. తీరికూచుని మీ అందరిచేత చేయించుకుంటున్నాను. మీ బావకి కాస్త ధైర్యం చెప్పు బాబూ'

'అక్కయ్యా, ఒక్కమాట అడగనా?'

'అడుగు తమ్ముడూ దానికేం?'

'బావ యింకా నిన్ను సాధించడం మానలేదా?'

'ఎవరి చాదస్తం వాళ్ళది. కాస్త గట్టిగా మాట్లాడ్డమే సాధింపు అనుకుంటే మనం ఎలా బతగ్గలం తమ్ముడూ...నాన్నయినా ఆయనయినా అభిప్రాయభేదాలు వస్తే నామీద అభిమానంచేతే కదట్రా!'

'నీ కిక్కడ ఏంతోస్తోందే అక్కయ్యా?'

'తోచడాని కేముంది? సరిగ్గా కిటికీదగ్గిర కూచుంటాను. ఈ కాంపౌండులోనే యీ డిస్పెన్సరీకి నీళ్లుతెచ్చేవాడి గుడిసె ఉంది. వాడికి మూడు మేకలూ నాలుగు కోళ్ళూ ఉన్నాయి. వాటితో ఎప్పుడూ నగ్నంగా ఉండే నాలుగేళ్ళ నల్లపిల్ల, వాడి కూతురనుకుంటాను. వాటిని తోలుతూ ఆడుకుంటు ఉంటుంది. ఈ కిటికీలోంచి వాళ్ళని చూస్తూ కాలక్షేపం చేస్తాను. నాకళ్ళకి యింకే రంగుల్నీ పోల్చేదృష్టి పోలేదు. ఎర్రటి పువ్వులూ, నీలం ఆకాశమూ నాకిక్కణ్ణుంచీ లీలగా కనిపిస్తాయి... నాకేం లోటు తమ్ముడూ అలాదుఃఖపడకు బాబూ.....

(68-వ పేజీ చూడండి)

# మనసులో సొగసు

(11-వ పేజీ తరువాయి)

ఎండెక్కిపోతోంది త్వరగా నీళ్ళోసుకుని భోంచెయ్యి. ఎప్పుడనగా తిన్నావో.'

నాకేమిటో ఆవిడచరిత్ర తెలుసుకోవాలనే కోరిక గడియగడియకూ ఎక్కువై పోయింది రాధా! మధ్యాహ్నం చిన్న కునుకు పట్టింది కాబోలు ఆవిడ తమ్ముడు వరండాలోకి వచ్చాడు. నాగదిలోకి పిలిచించి నేనెందు కొచ్చానో కొంచెం చెప్పి అడిగిచూశాను. పాపం చనువుగా నే మాట్లాడేడు కూడా!

'ఆవిడ మీ అక్కయ్యా? ఏంజబ్బండీ? ఎలా ఉందీ?'

'ఆవిడ నాకేకాదు ప్రపంచానికే అక్కయ్య. ఇక జబ్బుసంగతా, ఒకజబ్బని యేం చెప్పను? మందు లేనివ్యాధి. చావుతో కుదిరేజబ్బు. ఇంగ్లీషులో చెప్పాలంటే 'హార్ట్ ఫెయిల్యూర్, హై పెర్ టెన్షన్' అంటారు. గుండెల్లో బాగాఆయాసం. రక్తంపోటు యెక్కువ. ఇరవై నాలుగు గంటలూ కూచునేఉంటుంది. పడుకోలేదు. 'హార్టు ఎటాక్స్'అని వస్తాయి. మా ఊళ్ళో ఉన్నప్పుడు ఒకటివచ్చింది. గిలగిల కోడిపిల్లలా కొట్టుకుంటుంది. అబ్బా ఎవళ్ళం చూళ్ళేం'

'ఇక్కడికి వచ్చాక ఏంనయం కాలేదా?'

'ఏంనయం, ఇవాళే డాక్టరు చెప్పేడు అదింక బతకదని.. ఈసారి ఎటాక్ వచ్చిందా ఇక లాభంలేదు. నేను కోరేది ఒక్కటే. దాని బాధలు చూడలేక పోతున్నాను. త్వరగా తీసికెళ్ళిపొమ్మని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను!'

'ఊరుకో నాయనా ఏంచేస్తాం, పాపం ఇవన్నీ ఆవిడకి తెలియవు కాబోలు. ఎంత మొండిధైర్యం!'

'దానికి ఇవన్నీ తెలియవనుకుంటే మనమే తెలియనివాళ్ళం ఔతాం. దానికి అన్నీ తెలుసు...దానిదగ్గిర ఏ విషయం దాచడం ఎవరి తరమూ కాదు. ధర్మామీటరు చూస్తూంటే ముఖంనిగల్ని బట్టి ఎంతజ్వరముందో కనిపెట్టేంత సూక్ష్మబుద్ధి'

'అదేం ఆమె స్వయంగా చూసుకో లేదా?'

'ఏం చెప్పమన్నారు! మూడోసారి ఎటాక్ వచ్చి తగ్గింతర్వాత దానికంటిచూపు బాగా దెబ్బతింది. జీవితమంతా అంధకారమైనా, అది మనసులోంచి ఎలానవ్వగలదో నాకేం అర్థంకాదు. మామూలు అమ్మలక్కల్లా అది పనికిమాలిన కబుర్లతో కాలక్షేపం చెయ్యలేను. ఇంట్లో అన్నిపనులూ అయిపోయాక...గచ్చునేల [illegible]ంగా తుడుచుకుని పిల్లకిలా పడుకుని పక్కని ఒక ప్లేట్లో ఏకాదవ్వాసో పోసుకుని నవ్వుల్తో ఎప్పుడూ ఏదో పుస్తకం చదువుతూండేది. ఇప్పుడు ఈవ్యాధి అలా పడుకోనివ్వదు ఈ కళ్ళు అలా చదువుకోనివ్వవు. మాకు చేతనయినంతకాలం మాయింట్లో ఉంచుకుని మందులిప్పించాం. ఇంజక్షన్లు ఇప్పించి మా నాన్న వేలకివేలు తగలేశారు. ఏంలాభం? రోగం ఒక్కలాఉంది. ఇంగ్లీషు మందులు ఇప్పించి రోగం ఎక్కువచేశారని మా బావగారి వాదన. ముందునుంచీ ఆయుర్వేద మందులు యిచ్చి రోగం ముదరపెట్టేరని మా నాన్నగారివాదన. ఆఖరికి ఇంచుమించు ఆయనతో దెబ్బలాడి అక్కయ్యను ఇక్కడికి తీసుకొచ్చేశా. ఇంతజబ్బులో దీనికి ఈ మనోవేదన ఒకటి...ఆయాసంతగ్గి నిద్రపట్టాలీ అంటే మనసు నిర్మలంగాఉండాలి. ఆమాట ఒక్కరికేనా ఉంటేగా? నాకక్కడ ఉద్యోగం. వచ్చి ఎన్నాళ్ళుండగలను చెప్పండి?...అదిలేచినట్టుంది' అని వెళ్ళిపోయాడతను.

ఆ తరువాత ఒకనాడు చుక్కచుక్కల చీరకట్టుకుని తెల్లనిజాకెట్టు తొడుక్కుని తలనిండా మల్లెపువ్వులతో అన్నిటినిమించి కళకళలాడుతున్న మొహంతో మొగుడి గడ్డం పట్టుకుని ఆమె ఏమంది?

'ఎందుకలా విచారంగా చూస్తారు? నాప్రాణం పోతుందని భయమా? ఇన్ని ఎటాక్స్ వచ్చాయి. మొండిదాన్ని నన్నెవరు తీసికెళ్ళగలరు? అన్నీ వచ్చినట్టే తగ్గిపోతాయి. ఎందుకా కన్నీళ్ళు? ఇలా చూడండీ. ఎందుకలా పిచ్చివారయిపోతారు? ఇలా చూడండీ. జుట్టిలా మొహంమీద పడుతోందేం? ఎత్తెట్టి మొహంకడుక్కుని తలదువ్వుకురండి......పొండి నే చెప్పినట్టు చెయ్యరా......అంతేకదూ?' అని ముద్దు చేసింది భర్తని. ఆవిడ మనిషా, దేవతా? ఇలాంటివాళ్ళని చూళ్ళేదు. కనీసం ఎప్పుడూ ఊహించనైనా లేదు కూడా. మృత్యువు ముంగు వాకిట్లో ఉందని ఆవిడకి తెలుసు; అయినా ఆఖరి గడియదాకా ఎదుటవాళ్ళకి జవాబు చెబుతుందా! ఆవిడ ఆమరునాడు చనిపోయిందంటే ఎవరుమాత్రం ఎలానమ్ముతారు!

అంతదైన్యంలో ఆవిడ అంత మొండిగా ఎలా నిలబడగలిగింది? ఈ ప్రశ్న ప్రతిక్షణం నన్ను వేధించసాగింది. బాగా ఆలోచించగా నాకు సమాధానం దొరికింది. ఆవిడకు తన మీద నమ్మకముంది. ఆవిడ ఆనమ్మకంతో జీవించింది. జీవితానికి అర్థమేమిటో గ్రహించింది. కనుకనే బ్రతుకును సార్థకం చేసుకుంది. పాడువిధిగాని, పరిస్థితులుగాని ఆమె ఆత్మసౌందర్యాన్ని అణుమాత్రమైనా కదపలేకపోయాయి. అందులోని అనంతవిశ్వాసం నిలిచేఉంటుంది. ఆమె మృతజీవి.

ఇంకొకరినిగురించి ఆలోచించడం నా కప్పుడే మొదలు. నిజం చెప్పవలసివస్తే ఆ క్షణంనుంచే నేను జీవించడం నాకోసం కాదు ఎదుటివారికోసం అనేభావంలో ఎంత మాధుర్యముందో గ్రహించాను. ప్రతీ చిన్న విషయంలోనూ ఆమెతో నన్ను పోల్చసాగేను. సిగ్గుతో నా తల వాలిపోయింది. 'వెంటనే ఇంటికి వెళ్ళిపోదాం నాకేజబ్బూ లేదు'అని ఆయనతో చెప్పేదాకా, మొహమెత్తి ఆయన్ని చూడలేకపోయాను

ఆమె ఎవరో ఊరూపేరూ నాకిప్పటికీ తెలీదు. తెలుసుకోవలసిన అవసరంకూడా లేదు ఎవరైతేనేం? ఆమె నాపాలిదేవత. జీవించడం ఎలాగో ఎందుకో నేర్పినగురువు. నిజానికి నాకుటుంబంలో నేనూ ఉన్నాను అనేందుకు ఏంచేశాను? తలనొప్పివస్తే ఆయన సరిగ్గా కనుక్కోలేదని అన్నం మానేసిన రోజులూ, పిల్లల్ని ఎందుకుకొట్టేవని ఆయన అడిగినంతమాత్రాన మాటలు మానేసిన రోజులూ నన్ను వెక్కిరించాయి. అయినా ఇప్పటికయినా స్త్రీకి ఏది భూషణమో ఏదికవచమో నాకుతెలిసింది. తెలిసిందేమిటి? అది ఆచరణలో పెట్టడానికి మనసా ప్రయత్నంచేశాను. ఇప్పుడింట్లో అన్నిపనులూ నేనే చేసుకుంటున్నాను. మనుషుల పనిలేదు, ఇప్పుడు తీరికలేదు!

రాధా, ఈసారి యీవూరువచ్చినప్పుడు మాయింటికి భోజనానికిరా. మాతోపాటు భోజనానికి కూర్చో. ఆదరణ అంటే ఏమిటో కొత్తగా తెలుసుకున్న నాపిల్లల ఆనందం చూడు. అంతకన్న చిన్నపిల్లలతో సమానమయిన వెన్నమనస్సుగల ఆయనకళ్ళ వెలుగుచూడు. నా ముఖంలోని తృప్తి, సంతృప్తి చూడు. నీవు చూడగలిగింది అంతవరకే. కాని నాకళ్ళకు — చుక్కచుక్కల చీరా, తెల్లనిజాకట్టూ, మల్లెపువ్వులూ, కళకళలాడుతూ నన్ను చెయ్యెత్తి దీవిస్తున్న, నిండైనబతుకు బతికిన, వెయ్యిజ్యోతుల వెలుగుముఖం ఎప్పుడూ కనిపిస్తుంది! ★